క్లుప్తంగా

ఉర్దూ భాషలో బోర్డులను ఏర్పాటు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరపాలక సంస్థ అధికారులు నగరంలోని వీధుల పేర్ల బోర్డులను ఉర్దూ భాషలో ఏర్పాటు చేయాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని 50 డివిజన్లలో కార్పొరేషన్ అధికారులు వీధుల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మన రాష్ట్రంలో రెండో అధికార భాష ఉర్దూ ఉండగా ఎక్కడ కూడా సూచిక బోర్డులపై ఉర్దూ భాష లేకపోవడం బాధాకరమన్నారు. డిప్యూటీ సీఎం అంజాద్ భాషా ఉర్దూను రెండవ అధికారిక భాషగా తీసుకొని వస్తే అధికారులు ఎందుకు ఉర్దూ భాషలో బోర్డులను ఏర్పాటు చేయలేదని ఆయన ప్రశ్నించారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : స్వచ్ఛ భారత్‌లోని హరిత రాయబారులకు 15 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హరిత రాయబారులకు 15 నెలలుగా వేతనాలను చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందన్నారు. ఈ విషయమై 26న ఎంపీడీఓ కార్యాలయాల వద్ద నిరసన, జులై 3న స్థానిక ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు, జులై 10న కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మికుల యూనియన్ నాయకులు అంజనేయులు, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

30న విద్యుత్ భవన్ వద్ద ఆందోళన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ఈ నెల 30న విద్యుత్ భవన్ వద్ద నిర్వహించనున్న ఆందోళనను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీల భారాన్ని సామాన్య ప్రజలు భరించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ సంస్థలను మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యలపై చేస్తున్న ఆందోళనల భాగంగా ఎర్రముక్కపల్లె సర్కిల్ నుంచి విద్యుత్ భవన్ వరకు ర్యాలీ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఫరూక్ హుస్సేన్, అఫ్రోజ్ ఆలీఖాన్ పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మినహాయింపు

కడప కార్పొరేషన్ : ఈ ఏడాది మొదటి అర్థ సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నులపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ మినహాయింపు ఇచ్చిందని నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఆస్తి పన్ను యజమానులు ఈ సదావకాశమును సద్వినియోగం చేసుకొని జూన్ 30లోపు తమ పన్నులను చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా గానీ, సంబంధిత వార్డు సచివాలయంలోగానీ, ఆన్‌లైన్ ద్వారాగానీ ఆస్తి పన్నులను చెల్లించేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

చింతకొమ్మదిన్నె : గ్రామాల్లోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు తెలిపారు. శనివారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రాథమిక ఆరగ్య కేంద్రంలో మందులను పూర్తిస్థాయిలో ఉంచుకోవాలన్నారు. గర్భిణులకు ఇమ్యూనైజేషన్ సకాలంలో వేయాలన్నారు. ఇళ్ల మధ్యలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జిల్లా వైద్యాధికారి ఖాదర్ వల్లి, మండల వైద్యాధికారి రాఘవేంద్ర, సీహెచ్‌ఓ సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కమలాపురం : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని మండల తహసీల్దార్ అలీఖాన్, మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లింగాయపల్లె సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఎవరైనా ఉన్నారా? అని పరిశీలించారు. అలాంటి వారు ఎవరైన ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వారికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కడప రాయుని సన్నిధిలో కొత్త పథకాలు

- ప్రారంభమైన భక్తుల అన్నదానం
- విశేష పూజల కోసం అడ్వాన్స్ బుకింగ్



దేవునికడప క్షేత్రంలో భక్తుల అన్నదానం



శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం

కడప కల్చరల్ : తిరుమల–తిరుపతి దేవస్థానం తన పరిధిలోని దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నాలుగు కొత్త పథకాలను అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు తొలి కార్యక్రమంగా భక్తుల అన్నదానం శనివారం ప్రారంభించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేయడం ప్రధాన కార్యక్రమంగా భావిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఈ కార్యక్రమాన్ని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుని సాక్షిగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఘనంగా ప్రారంభించారు. స్థానిక భక్తులు ఏ శనివారమైనా తమ ఖర్చుతో అన్నదానికి అవసరమైన అన్నం, కూరలు తీసుకు రావాల్సి ఉంటుంది. వాటిని కల్యాణ మండపంలో ఆలయ అధికారుల సహకారంతో అన్నదాతలు భక్తులకు వడ్డిస్తారు. ఇందులో భక్తుల సంఖ్య గురించి పట్టింపు లేదు. మొక్కుగల వారు తమ ఆర్థికశక్తిని బట్టి 50, 100, 150 మందికి తామే అన్నాన్ని ఏర్పాటు చేయవలసి ఉంటుంది. మధ్యాహ్నం 11.30 గంటలకు ఆలయ పూజా కార్యక్రమాలు పూర్తయిన వెంటనే ఆ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో భక్తులకు అన్నదానం చేయనున్నారు. శనివారం తొలి అన్నదానం ప్రారంభమైంది. దాతలు దాదాపు 200 మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు.

విశేష స్పందన

పెద్దగా ప్రచారం లేకపోయినా ఈ కార్యక్రమానికి విశేషమైన స్పందన లభిస్తోంది. వచ్చే వారం అన్నదానానికి ఓ భక్తుడు సిద్ధమై పేరు నమోదు చేయించగా, శ్రావణమాసంలోని నాలుగు శనివారాలు తామే అన్నదానం చేయిస్తానని మరొక భక్తుడు ముందుకు వచ్చి పేరు నమోదు చేసుకున్నారు.

విశేష పూజలు

అన్నదానంతోపాటు విశేష పూజల పథకాన్ని కూడా టీటీడీ అధికారులు అనుమతించారు. ఇందులో భాగంగా 1000, 5000, 10,000 స్కీములను రూపొందించారు. రూ. 10 వేలు ఒకేసారి దేవునికడప ఆలయ అధికారులకు అందజేసి రశీదు తీసుకుంటే 10 ఏళ్ల పాటు సంవత్సరానికి 30 రోజుల పాటు ఆ వ్యక్తి పేరిట స్వామి, అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని అందజేస్తారు. రూ. 5 వేలు చెల్లించిన వారికి ఐదు సంవత్సరాలపాటు ఏటా 30 రోజులపాటు ఈ పూజలు చేసి ప్రసాదం అందజేస్తారు. రూ. 1000 అందజేసిన వారికి సంవత్సరంపాటు ఈ పథకం అమలవుతుంది. ఈ పథకాల కారణంగా ఈ క్షేత్రంలో శనివారాలతోపాటు ఇతర రోజుల్లో కూడా భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

విద్వేషాలు రెచ్చగొడుతున్న టీడీపీ నాయకులు

- తాగునీటిని అడ్డుకుంటే కడపలో అడుగుపెట్టలేరని హెచ్చరిక
- ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పాకా సురేష్ కుమార్



మాట్లాడుతున్న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పాకా సురేష్ కుమార్

కడప కార్పొరేషన్ : కడప నగరానికి తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పిస్తే టీడీపీ నాయకులు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు, 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్ ధ్వజమెత్తారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా కడప నగరంలో తాగునీటి సమస్యకు శాశ్విత పరిష్కారం చూపలేకపోయాయన్నారు. దివంగత వైఎస్సార్ సోమశిల వెనుక జలాలను కడపకు తీసుకురావాలని సంకల్పించి, రూ.50కోట్లు ఖర్చు చేశారని, ఆయన మరణం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ స్కీంను పట్టించుకోలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ స్కీంను రద్దుచేసి, పెన్నానదిలో లింగంపల్లి వద్ద సబ్ సర్ఫేజ్ డ్యామ్ నిర్మిస్తామని గొప్పలు చెప్పి, శంకుస్థాపనకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.450 కోట్లతో మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంసాగర్ నుంచి 1.50 టీఎంసీల నీటిని కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు తీసుకురావాలని సంకల్పించాయన్నారు. దీన్ని రాజకీయ సన్యాసం తీసుకున్న కొందరు టీడీపీ, బీజేపీ నాయకులు వ్యతిరేకిస్తూ, ప్రజల మధ్య గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లాపై ఉన్న మమకారంతో మంచి కార్యక్రమాలు చేస్తుంటే టీడీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు చేయడం నీతిబాహ్యమన్నారు. కడపలోని టీడీపీ నాయకులు వారిని నియంత్రించాలని, లేనిపక్షంలో నగరవాసులు వారిని బహిష్కరిస్తారని, భవిష్యత్‌లో వారు కడపలో అడుగుపెడితే తరిమికొట్టే పరిస్థితులు ఏర్పడుతాయని హెచ్చరించారు. కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు చైతన్య, లక్ష్మయ్య, 21వ డివిజన్ ఇన్‌చార్జి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యమాత క్షేత్రానికి నూతన డైరెక్టర్



ఆరోగ్యమాత క్షేత్ర డైరెక్టర్ ప్రసాద్‌రావు

కడప కల్చరల్ : కడప నగరంలోని సుప్రసిద్ధ క్రైస్తవ ఆరాధన క్షేత్రమైన ఆరోగ్యమాత పుణ్యక్షేత్రానికి నూతన డైరెక్టర్‌ను నియమించారు. రైల్వేస్టేషన్ సమీపంలోని ఈ క్షేత్రానికి ఇప్పటివరకు పెండ్లికట్ల అబ్రహం డైరెక్టర్‌గా ఉండేవారు. ఆయన స్థానంలో నూతన డైరెక్టర్‌గా ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు నియమితులయ్యారు. కడప అపోస్తలిక పాలనాధికారి, కథోలిక పీఠాధిపతులు బిషప్ గాలి బాలి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు నూతన డైరెక్టర్ ఫాదర్ ప్రసాద్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యమాత క్షేత్రంలోని తన కార్యాలయంలో నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమాత విశ్వాసులను మరింత ఆధ్యాత్మిక పథకంలో ముందుకు నడిపించేందుకు ఈ క్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. వచ్చే మాసంలో జరగనున్న బిషప్ అరుళయ్య వర్ధంతిని మేత్రాసన స్థాయిలో ఆయన ఘనతను అందరికీ తెలిసేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

ఎఫ్‌ఏసీ హెచ్‌ఎంలకు డ్రాయింగ్ పవర్స్ ఇవ్వాలి



జిల్లా ఖజానా ఉపసంచాలకులు వెంకటేశ్వర్లుకు వినతిపత్రమిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఇటీవల జరిగిన ఎంఈఓ–2 కౌన్సెలింగ్ ద్వారా పలువురు ప్రధానోపాధ్యాయులు ఎంఈఓలుగా బదిలీపై వెళ్లారని, వారి స్థానంలో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు డీఈఓ రాఘవరెడ్డి ఏఏసీ హెచ్‌ఎం బాధ్యతలకు ఉత్తర్వులు ఇచ్చారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. ఈ విషయమై సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు డ్రాయింగ్ పవర్స్‌ను కల్పించాలని శనివారం యూటీఎఫ్ నాయకులు జిల్లా ఖజానా ఉపసంచాలకులు వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ విషయంలో ఆలస్యమైతే జీతాలు పెట్టుకోవడానికి ఇబ్బంది కలుగుతుందని వారు ఆయనకు వివరించారు. కావున వీలైనంత త్వరగా ఎస్‌టీవోలకు తగిన సమాచారం అందించి ఎఫ్‌ఏసీ ప్రధానోపాధ్యాయులకు జీతాల బిల్లులు వెంటనే పెట్టేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా. శివా నాయక్

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు శివా నాయక్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగనన్న సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివానాయక్ మాట్లాడుతూ నవరత్న పథకాల్లో ఎందులోనైనా అర్హత ఉండి వారికి పథకాలు వర్తించకపోతే వారికి లబ్ధి చేకూర్చేలా వైద్య విభాగం నాయకులు కృషి చేయాలన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడం, ప్రతి ఇంటికి వైద్య బృందం వెళ్లి పరీక్షలు చేయడం, విలేజ్ క్లీనిక్‌లు వంటి వాటిపై ప్రజలకు తెలియజేయాలన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబుల సహకారంతో త్వరలోనే నగర కమిటీఏర్పాటు చేస్తామన్నారు. డా. వారణాసి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. నగర అధ్యక్షుడు డా. సతీష్‌రెడ్డి, డా. పవన్ కుమార్ రెడ్డి, డా. సుదర్శన్, డా. మస్తాన్, డా. గోపీనాథ్, డా. పెంచలయ్య, గోవర్ధన్, రమేష్ నాయక్, మహిళా నాయకురాళ్లు సింధు, సావిత్రి పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో అక్రమ నిర్మాణాలను ఆపాలి



కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌కు వినతిపత్రమిస్తున్న ప్రసాద్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని ఇందిరానగర్‌లో అక్రమ నిర్మాణాలను ఆపాలని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఇందిరానగర్‌లో ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను ఆపాలని కోరుతూ నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకొమ్మదిన్నె మండలం ఇందిరానగర్‌లోని లే అవుట్‌లోని సర్వే నెంబర్ 731,732,733 నెంబర్లలో భూ కబ్జాదారులు అక్రమించుకొని పునాదులు వేస్తున్నారని తెలిపారు. నగర పాలక సంస్థ అధికారులు అక్రమ నిర్మాణాలను చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : అకడమిక్ కన్సల్టెంట్‌లు బోధనా నైపుణ్యాలను, పరిశోధన దృక్పథం పెంపొందించుకోవాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూలో అకడమిక్ కన్సల్టెంట్‌ల పనితీరుపై మదింపు కార్యక్రమం రెండోరోజు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అకడమిక్ కన్సల్టెంట్‌లు ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమయ్యేలా నాణ్యమైన, సమాజ ప్రయోజనకరమైన పరిశోధనలు కొనసాగించాలని సూచించారు. బోధించే పాఠ్యాంశంపై అవగాహన, నిరంతర అధ్యయనం చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అకడమిక్ కన్సల్టెంట్‌లు వారి అర్హతలను పెంచుకోవడంతో పాటు పీహెచ్‌డీలు కలిగిఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఏజీ దాము, ఆచార్య కె. కృష్ణారెడ్డి, డా. జయంత్‌కశ్యప్, డా. ఎం. సుభోషచంద్ర, డా. వరప్రభాకర్, డా. సునీత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

వల్లూరు : రాష్ట్రంలోని ప్రజల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు నందిస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులకు సైతం అంతే ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్‌ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలు తెలిపారు. వల్లూరు నుంచి పుష్పగిరి మీదుగా చెన్నూరు మండల పరిధిలోని ఉప్పరపల్లె వరకు సీఆర్‌ఐఎఫ్ నిధులు రూ.22.20 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం వారు భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తైతే పుష్పగిరి పుణ్యక్షేత్రంతోపాటు పర్యాటక కేంద్రమైన ఆదినిమ్మాయపల్లె ఆనకట్టకు, పలు గ్రామాలకు సౌకర్యవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ గంగయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి, డీఈ షాక్లా వలీ, ఈఈలు ప్రభాకర్ నాయుడు, నరసింహారెడ్డి, జేఈ సునీల్, తహసీల్దార్ శంకర్‌రావు, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు కిషోర్‌కుమార్, పిచ్చిరెడ్డి, బాలవీరారెడ్డి, బాలిరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, ఓబీ సుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, పంచాయతీ కార్యదర్శి రామ్మూర్తి పాల్గొన్నారు.

స్కార్పియో బోల్తా

– ఐదుగురికి గాయాలు

కలసపాడు : మండలంలోని పిడుగుపల్లె – శంఖవరం గ్రామాల మధ్యలో మలుపు వద్ద శనివారం స్కార్పియో బోల్తాపడటంతో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఎగువ తంబళ్ళపల్లె గ్రామంలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి సొంత గ్రామమైన ప్రొద్దుటూరుకు స్కార్పియో వాహనంలో వెళుతుండగా మార్గంమధ్యలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో స్కార్పియోలో ప్రయాణిస్తున్న సమీర్ తోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే బాధితులను 108 వాహనం ద్వారా పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమీర్‌ను మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకెళ్లారు.

నిత్యావసర వస్తువులు అందజేత



బృంద వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న మీకోసం సేవా సంస్థ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్: చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్ నగర్‌లోని బృంద వృద్ధాశ్రమానికి ఆర్‌కె హెల్పింగ్ హ్యాండ్స్, కువైట్ సహకారంతో మీకోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువచేసే నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా జన వికాస్ సేవా సమితి వ్యవస్థాపకులు ఎస్‌ఎండీ తాహీర్ మాట్లాడుతూ ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ ప్రతినిధులు జీవనోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లి సంపాదిస్తూ అందులో కొంత ధనాన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలకు వెచ్చించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌బీడీ ఫైనాన్షియల్ సర్వీసెస్ కడప బ్రాంచ్ మేనేజర్ గౌస్ బాష, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణు వర్ధన్, అమ్మ సేవా సమితి శివశంకర్, బాసట సేవా సంస్థ ఈశ్వరయ్య, ఆశ్రమ నిర్వాహకులు బాల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో సత్ప్రవర్తనతో మెలగాలి



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ లావణ్య

కమలాపురం : తెలిసో తెలియకో క్షణికావేశంలో చేసిన తప్పులతో కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి ఉటుందని, కనీసం జైలు నుంచి వెళ్లాకైన సత్ప్రవర్తనతో మెలగాలని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ లావణ్య తెలిపారు. శనివారం స్థానిక సబ్‌జైలును పరిశీలించిన ఆమె రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. మీకు ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలుకు వచ్చి ఉంటారని, దీంతో కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. ఇలాంటి తప్పులు తిరిగి చేయకుండా జైలు నుంచి బయటకు వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అపుడే అందరికితో కలసి ఉండవచ్చని, సమాజంలో గౌరవం, గుర్తింపు ఉంటాయన్నారు. అనంతరం గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థినులతో ముచ్చటించారు. మీకేమైన సమస్యలున్నాయా? అని ప్రశ్నించారు. మీరు బాల్య వివాహాలు చేసుకోరాదని, అది చట్టరీత్యా నేరమన్నారు. దాని వలన అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. మీపై ఎవరైన అఘాయిత్యాలకు పాల్పడితే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు లేదా 100కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ గంగాధర్, ప్రిన్సిపాల్ తులశమ్మ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

చెన్నూరు : అర్హులుగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని వారికి ఆయా పథకాలు అందించడంతోపాటు ప్రజలకు అవసరమైన పత్రాలను అందించేందుకు జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేయడం జరుగుతోందని పంచాతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్యలు తెలిపారు. శనివారం చెన్నూరులోని రెడ్డివారివీధి, చౌడమ్మ వీధి, రామాలయం వీధి, మట్టవారి వీధి, అరుంధతినగర్‌లలో వారు వలంటీర్లతో కలిసి పర్యటించి అక్కడి ప్రజలతో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. సమస్యలు ఉంటే వలంటీర్లకు తెలిపితే వెంటనే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టుసాధించేలా బోధన

వైవీయూ : విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టుసాధించేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన ఆంగ్లమాధ్యమ శిక్షణ ముగింపు శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచీకరణ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచి, విద్యార్థుల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఆంగ్లభాషపై పట్టు సాధించే విధంగా బోధన సాగించాలన్నారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన అధ్యాపకులు ఇక్కడ నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డా. డేవిడ్ కుమార్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రవిశేఖర్, మాస్టర్ ట్రైనర్స్ కృష్ణవేణి, కృష్ణారెడ్డి, సహదేవరెడ్డి, గురుమోహన్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

కడప అర్బన్: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాసాపేటలో మట్కా రాస్తున్న వల్లెపు విశ్వనాథ్‌ను ఎస్‌ఐ సంజీవరాయుడు శనివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 3 వేలు నగదుతో పాటు, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

- గౌస్‌నగర్‌లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.

నిధుల స్వాహాపై కలెక్టర్‌ను కలిసిన వీఓఏలు



డీఆర్‌డీఏ పీడీని కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతున్న వీఓఏలు

వల్లూరు : వల్లూరు వైఎస్‌ఆర్ క్రాంతి పథకంలో గ్రామ సంఘాల ఖాతాల నుంచి నిధుల స్వాహా విషయమై మండలంలో పనిచేస్తున్న వీఓఏలు (ఆనిమేటర్లు) శనివారం జిల్లా కలెక్టర్ విజయ రామరాజును కలిశారు. మండలంలో పనిచేస్తున్న 30 మంది వీఓఏలు కడప కలెక్టరేట్‌లో ఆయనను కలిసి సీసీ స్వాహా చేసిన నిధులకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందచేశారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందచేశారు.

సీకేదిన్నె ఎంఈఓ 2గా రమాదేవి బాధ్యతల స్వీకరణ

చింతకొమ్మదిన్నె : మండల విద్యాధికారి–2గా రమాదేవి శనివారం బాధతలు చేపట్టారు. ఈ సందర్భంగా అంగడి వీధిలోని పాఠశాలలో ఆమెను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి, హెచ్‌ఎం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు కేరాఫ్ ఆంధ్రప్రదేశ్

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సంక్షేమ పథకాలకు కేరాఫ్ ఆంధ్రప్రదేశ్ అని, ప్రపంచంలో ఎక్కడా లేనన్ని పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయని అది కేవలం జగనన్న సీఎం కావడంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం కమలాపురం వార్డు–1 సచివాలయం పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పట్టణ నాయకులు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు కావాలని ప్రజలు కోరడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించారు. ఇంకా పథకాలు రానివారు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు. మీ సమస్యలు తెలుసుకోవడానికే, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం కోసమే జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని సీఎం జగనన్న ప్రారంభించారన్నారు. అర్హులుగా ఉన్నప్పటికి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారిని గుర్తించి పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అవ్వా తాతలకు వారి మనవడు జగనన్న ఇస్తున్న పింఛన్ రూ.2750 దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. చంద్రబాబు నాయుడు గతంలో దొంగ హామీలిచ్చి సీఎం అయ్యారని అయినా ఒక్కటి నెరవేర్చలేదన్నారు. బాబు తన పాలనంతా అవినీతికి కేర్‌ఆఫ్‌గా పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మహ్మద్ సాదిక్, గఫార్, హిదాయత్, జావీద్, ఇర్ఫాన్, రెడ్డికరీం, ఫారుక్, సలీమ్, ఇమ్రాన్, టి.రంతు, మోహసిన్, మన్సూర్, నూర్, మోనార్క్, జిలానీ, మండల, జిల్లా నాయకులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.